రచన - నవంబర్ 2001

# కాప్యకారము

చిరుగాలుల సవ్వడికి అలల అలజడిని జోడిస్తూ గట్టుకవతల గోదావరి ప్రవహిస్తోంది. రావిచెట్టు ఆకుల గుబుర్లలోంచి దూసుకొస్తున్న నిండు చంద్రుడి వెండి కిరణాలు, ఎగుడు దిగుడు నేల మీద చిత్రవిచిత్రమైన రంగవల్లుల్ని చిత్రిస్తున్నాయి. కోతకొచ్చిన వరిచేలు పొగమంచు భారంతో తలలు వంచుతున్నాయి.

రావిచెట్టు కింద నులక మంచం మీద పడుకొని, మెడ వరకూ బొంత లాక్కొని రాత్రి పది గంటలవేళ నిద్రకుపక్రమిస్తున్న సత్యానికి, కాస్తంత దూరంలో ఉన్న కాలిబాట మీద అడుగుల చప్పుడు లీలగా వినిపించింది. వెనువెంటనే పట్టీవేళ్ళ అత్తరు వాసన అంతంత మాత్రంగా గాలిలో తేలియాడింది. వందడుగుల దూరంలో కనుపించని మూడు గదుల వసారా ఇంటి వైపు పయనించి, నిశబ్దంలో కలిసిపోయిన ఆ అడుగుల చప్పుడు గతాన్నీ, ప్రస్తుతాన్నీ మరోసారి ఆలోచనల పరిధిలోకి తీసుకువచ్చి సత్యాన్ని క్షోభపెట్టసాగింది. అంధుడైన సత్యానికి ముఖం మీద చలిగాలి స్పర్శ తప్ప, ప్రకృతి ఎంత మనోహరంగా ఉందో తెలియటల్లేదు. ఊహించుకోగల మనసున్నా, ఆ క్షణం మనసు మరో దారిలో పయనిస్తోంది. చెప్పలేని వ్యథతో మూలుగుతోంది.

నాలుగేళ్ళ క్రితం-పదహారు సంవత్సరాల వయసులో ఉన్నప్పుడు, అమ్మవారి జాతరలో అమ్మా నాన్నలతో తిరుగుతున్నప్పుడు జరిగిన ఓ ప్రమాదంలో, తల్లిదండ్రుల్నీ, తన కంటి చూపునీ పోగొట్టుకొన్నాడు సత్యం. హాస్పిటల్లో సత్యం స్పృహ తప్పిన పరిస్థితిలో ఉండగా, అన్న 'భీముడు' అసువులు పోగొట్టుకొన్న తల్లిదండ్రులకి అంత్యక్రియలు జరిపాడు. కళ్ళ ఆపరేషన్ జరిగిన అయిదో రోజు కట్లు విప్పినప్పుడు, ఎదురుగా నిలిచిన అంధకారాన్నీ, నుదుట మీద అన్నచేతి స్పర్శనీ గుర్తించిన సత్యం బావురుమన్నాడు.

అంధుడైన సత్యాన్ని భీముడు వాటేసుకొని ఓదార్చాడు -

"నా కంఠంలో ప్రాణముండగా నీకేలోటూ జరగదు. అమ్మా నాన్నల మీద ఒట్టు" అంటూ.

అప్పలస్వామి ట్రాన్స్‌పోర్టు కంపెనీలో లారీ డ్రైవరుగా పనిచేసే భీముడు తల్లిదండ్రులు పోవడంతో, గోదావరి గట్టుకు దిగువగా ఉన్న తమ రెండెకరాల పొలాన్ని సాగుచెయ్యడం కోసం వీలుకుదరని పరిస్థితిలో ఉద్యోగం మానుకొన్నాడు. కంటిచూపు పోయినా తింటూ కూర్చోడం యిష్టంలేని సత్యం నవారు నేత, పీచుతాళ్ళ పేనుడు లాంటి పనులు నేర్చుకొని,

అదే వ్యాపకంతో చిన్నతరహా వ్యాపారం మొదలు పెట్టాడు. వారంలో సత్యం అల్లిన తాళ్ళనీ, నేసిన నవారునీ అన్న భీముడు ఆదివారం సంతలో అమ్మి, ఆ డబ్బుని తమ్ముడి చేతికివ్వడం, 'ఈ డబ్బు నేనేం చేసుకొంటాను? నీ దగ్గరే ఉంచు' అని సత్యం తిరిగి యివ్వడం పరిపాటై పోయింది.

వడగాలులు వీచినప్పుడూ, వర్షాలు కురిసినప్పుడూ తప్ప మిగిలిన కాలమంతా చెట్టు నీడనే ఉండడానికలవాటుపడ్డాడు సత్యం.

పగలనక, రాత్రనక నువ్విలా ఆరుబయట ఉండడం బావుండదు. రోజు పని పూర్తయిన తర్వాత ఇంట్లో ఉంటే బావుంటుంది" అన్నాడోసారి భీముడు.

"అంధుణ్ణైన నేను నాలుగ్గోడల మధ్యా బంధితుణ్ణై ఆ ఒంటరితనాన్ని భరించలేను. చెట్టుకింద కాపురం నన్ను లోకానికీ, ప్రకృతికీ సన్నిహితుణ్ణి చేస్తుంది. నాకేవిధమైన ఇబ్బందీలేనప్పుడు పై వాళ్ళేదో అనుకొంటారని మనసు పాడుచేసుకోకు" అన్నాడు సత్యం.

ఆ తర్వాత భీముడు సత్యాన్ని మరి బలవంతం చెయ్యలేదు.

దుర్ఘటన జరిగిన మూడో ఏడు రెండు పంటలూ దెబ్బతినడంవల్లా, పొలం మీద రాబడి అంతంత మాత్రంగానే ఉండడంవల్లా, భీముడు మళ్ళీ అప్పలస్వామి కంపెనీలో లారీ డ్రైవరుగా చేరాడు. ఉదయాన లేస్తూనే యింత వండిపడేసి, డ్యూటీ మీద పోయి, సాయంత్రానికల్లా తిరిగి వచ్చేసేవాడు. మొదట్లో కాస్త యిబ్బంది కలిగినా పోను పోనూ ఈ విధమైన జీవితానికి యిద్దరూ అలవాటు పడిపోయారు. అప్పలస్వామి ధర్మమా అని దూరప్రాంతాలకి డ్యూటీలో పోకుండా మొదట్లో వీలుపడినా, ఏజన్సీ ప్రాంతాలకి సరుకు రవాణా చేయ్యడంలో లాభాలధికంగా వస్తూండడంతో భీముడి మీద ఒత్తిడి రాసాగింది. అంతదూరం వెళ్ళి తిరిగి రావాలంటే కనీసం రెండు రోజులు పట్టుంది. అటువంటి డ్యూటీలకి వెళ్ళినప్పుడల్లా, పొలం పనుల్లో సహాయంచేసే 'నాగన్న' తల్లి వచ్చి కాస్త వంటా వార్పూ చూసేది. కొంతకాలం ఈ ఏర్పాటు సవ్యంగా జరిగినా, ఇంట్లో కొని పడేసిన సరుకులూ, చిన్న చిన్న యితర సామాన్లూ మాయమవుతూండడంవల్ల కొన్ని సమస్యలు తలెత్తాయి.

ఓ రోజు సాయంత్రం సత్యం నవారు నేస్తున్న సమయంలో గోదావరి గట్టు దిగాడు భీముడు ఓ స్త్రీని వెంటబెట్టుకొని.

"సత్యం, మన యిల్లు సక్రమంగా నడవాలంటే ఆడతోడు అవసరమని, గునుపూడి రాములవారి కోవెల్లో నలుగురెదుటా ఈ సావిత్రి మెళ్ళో పసుపుకొమ్ము కట్టి తీసుకువచ్చేశాను. కంటిచూపు పోయినా కూర్చున్నచోటు నుంచి కదలకుండా శ్రమపడి, డబ్బు సంపాదించే సత్తా ఉన్న నా తమ్ముణ్ణి చూడు సావిత్రీ! నువ్వింటి పనులు చూసుకొంటూ, ఆ పొలం మీద ఓ కన్నేసి కూర్చుంటే అన్నీ సవ్యంగా జరిగి మనకి లోటుండదు" అన్నాడు భీముడు యిద్దర్నీ ఉద్దేశిస్తూ.

చివరికి, అన్న జీవితంలో స్థిరపడడం సత్యానికి చాలా సంతోషం కలిగించింది. అన్ననెలా

అభినందించాలో తెలియక తికమకపడ్తోంటే – "సావిత్రి నిన్నెలా చూస్తుందోనన్న భయం వద్దు, నీ గురించి ముందుగానే చెప్పాను. ప్రమాణం చేయించుకొని మరీ తాళి కట్టాను తెలుసా?!" అన్నాడు భీముడు.

"ఎలా చూస్తుందన్న బెంగలేదుకాని, అన్నహితవుని మరచిన నోళ్ళని మళ్ళీ మామూలు స్థితికి తీసుకువస్తే చాలు" అన్నాడు సత్యం హాయిగా నవ్వుతూ.

తీసుకున్న వారం రోజుల సెలవూ ముగియడంతో, భీముడు తిరిగి డ్యూటీ చెయ్యడం మొదలు పెట్టాడు. ఓ నెల రోజుల పాటు దగ్గర దూరాలకే వెళ్ళి, చీకటి పడేసమయానికి ఇల్లు చేరేవాడు. సావిత్రి కూడా యింటి పనులయిన తర్వాత సత్యానికి కావల్సిన సరుకులన్నీ సమకూర్చి, నేసిన నవారునీ, అల్లిన తాళ్ళనీ చుట్టలు చుట్టి సహాయం చేసేది.

ఉన్నట్టుండి పెళ్ళయిన తర్వాత మొదటిసారిగా ఏజన్సీ ప్రాంతాలకి లారీ తీసుకువెళ్ళాల్సి వచ్చింది భీముడికి.

"ఇహనుంచీ కనీసం వారానికొక్క సారైనా ఏజన్సీ వెళ్ళక తప్పదు. మిగిలిన డ్రైవర్లందరూ గోలపెడ్తున్నారు. అప్పలస్వామి కూడా వాళ్ళని సమాధానపరచలేకపోతున్నాడు!" అన్నాడు భీముడు.

"ఇదివరకుమల్లే ఇప్పుడు బెంగ అనవసరం – నువ్వు నిశ్చింతగా వెళ్లిరా" అన్నాడు సత్యం.

"నాకు యింటిని గురించి బెంగలేదు కాని, నువ్వు మట్టుకు మొహమాటపడకూడదు.

"మొహం చూసి అడిగితే మొహమాటపడవలసివస్తుందేమో కాని, కంటిచూపు లేనివాణ్ణి నా కెందుకు మొహమాటం?!" అన్నాడు సత్యం.

భీముడూ, సావిత్రీ నవ్వేశారు.

అడ్డతీగల ఏజన్సీకి భీముడు లారీ నడుపుకుపోయిన ఆ రోజు రాత్రి జరిగిన ఓ సంఘటన, సత్యం ముందో సమస్యని లేవనెత్తింది. సాధారణంగా నులివెచ్చటి సూర్యకిరణాలు నుదుట తాకితే గాని మెలకువరాని సత్యానికి, ఉన్నట్టుండి తెల్లవారక ముందే మెలకువ వచ్చింది. పక్కనే ఉన్న కాలిబాట మీదుగా ఎవరో గోదావరి గట్టెక్కుతున్నట్టుగా అడుగుల సవ్వడి. తగిలీతగలనట్టుగా సువాసనల తెమ్మెర! ఆ సువాసన తనకు పరిచయమైనదే. అప్పలస్వామి వాడే వట్టివేళ్ళ అత్తరు వాసన! సత్యం మనసులో అనుమానం చోటు చేసుకుంది. లోకానికి వెలుగుని ఇవ్వడానికి సూర్యుడాకాశంలోకి లేచినా, చీకటి ఆవరించిన మనసుతో సత్యం సతమతమవ సాగాడు.

ఆ రోజు సావిత్రి పెట్టిన తిండి సహించలేదు. సాయంత్రానికి భీముడు తిరిగి వచ్చాడు. ఇద్దరి మొహాల్లోకీ చూడ్డానికి వీలులేకుండా అడ్డొచ్చిన అంధత్వాన్ని మనసులో మొదటిసారిగా అభినందించాడు. మాటిమాటికి తన పని మీద ధ్యాస తప్పించే ఆలోచనల్నీ, అనుమాన పిశాచాన్నీ, 'ఇలా ఆలోచిస్తూ, అనుమానిస్తూ బుర్ర పాడుచేసుకోవడంలో అర్థం లేదు! అదేదో పీడకల అయ్యుంటుంది', అనుకొంటూ, ఓ రెండు రోజుల ప్రయత్నంతో ఓ మూలకి నెట్టేశాడు.

అయిదు రోజుల తర్వాత భీముడు ఏజన్సీకి లారీ తీసుకుపోయిన ఈ రోజు రాత్రి మళ్ళీ అటువంటి అనుభవం. ఈ మాటు తమ ఇంటి వైపు పయనించే అడుగుల సవ్వడి! తనకు తెలిసిన అదే అత్తరు వాసన! నిస్సందేహంగా అప్పలస్వామే!

ఏంచేయ్యాలి తనిప్పుడు? అక్కడ తమ ఇంట్లో అన్న భీముడికే కాక, తమ వంశమర్యాదలకే ద్రోహం జరిగిపోతోంటే, తనిక్కడ కాపలా కాస్తూ పడుకొన్నాడు! తనకు కంటిచూపు లేదు కదాని ఇద్దరూ ఎంతకు తెగించారు?! అన్న వచ్చిన తర్వాత ఏం చెప్పాలి? జరుగుతున్న వ్యవహారాన్నెలా తెలియచెయ్యాలి? అన్న నమ్ముతాడా? నమ్మితే అన్న ఏం చేస్తాడు? ఉద్రేకంలో అన్న ఏదైనా అఘాయిత్యానికి తలబడితే పర్యవసానం ఎలా ఉంటుంది? సావిత్రే తన మీద నేరాలు చేస్తే? సమాధానం లభించని ప్రశ్నలతో, తల వాచిపోతున్న ఆలోచనలతో సత్యానికి ఎంత సమయం గడిచిపోయిందో తెలియనేలేదు.

ఉన్నట్టుండి దగ్గరవుతున్న అడుగుల ధ్వనినీ, ముక్కుపుటాలకి తగిలిన అత్తరు వాసననీ గుర్తించిన సత్యం ఒక్కసారిగా పక్క మీద లేచి కూర్చుని, "ఎవరిది?" అని ప్రశ్నించాడు అతికష్టం మీద. వెంటనే గట్టుపైకి ఎవరో పరుగెత్తిన చప్పుడు, ఆపైన నిశ్శబ్దం. అంతవరకూ స్తబ్దుడిగా ఉండిపోయిన సత్యంలో ఒక్కసారిగా ఆవేశం పొంగుకొచ్చింది. మంచం మీద నుంచి ఒక్క ఉదుటులో దిగి, పక్కనే ఉన్న చేతి కర్ర అందుకొని, నేలని తడుముకొంటు వసారా యింటి వైపు దారి తీశాడు.

అప్పలస్వామి ఆకలి తీర్చుకొని వెళ్లిన తర్వాత, విడిచిన దుస్తుల్ని ధరించి, నలిగిన పక్కని సరిచేసి, గది బయట వసారాలో కొచ్చి, కర్ర స్తంభానికానుకొని అన్యమనస్కంగా నిల్చున్న సావిత్రి, వెండి తుంపర లాంటి పొగమంచులో అడుగులో అడుగు వేసుకొంటూ వస్తున్న సత్యాన్ని చూసి గతుక్కుమంది. గదిలోకి వెంటనే వెళ్ళి తలుపులు గడియపెట్టి అక్కడే నిల్చుండి పోయింది. కొంతసేపట్లో వేగంగా కొట్టుకొనే గుండె చప్పుడుతో బాటు తలుపు తట్టిన చప్పుడు కూడా వినబడింది. గుండె దిటవు చేసుకొని తలుపు తెరిచింది.

"ఆ వచ్చివెళ్ళింది అప్పలస్వామేనా? నా అన్న ఊళ్ళోలేని సమయంలో మీరిద్దరూ చేస్తున్నదేమిటీ?" - నిలువెల్లా వణికిపోతూ, ఒక్కొక్క మాటా కూడదీసుకొని కోపంగా అడిగాడు సత్యం.

సమాధానం చెప్పకుండా సావిత్రి సత్యం చేతిలోని కర్ర లాక్కొని ఓ పక్కగా పడవేసి చెయ్యి పట్టుకొంది. రెండో చేత్తో బుగ్గలు నిమిరింది. ఆ స్పర్శతో సత్యం ఒళ్ళు జలదరించింది. అప్రయత్నంగా, అనాలోచితంగా ఆమె భుజం మీద చేయి వేశాడు. సావిత్రి దగ్గరగా జరిగి సత్యం చుట్టూ చేతులు పెనవేసింది. ఆ కౌగిలిలో సత్యం వివశుడై పోయాడు.

"ఆరుబయట వెన్నెల్లో ఆకాశం కింద హాయిగా గడపాలని ఉంది. పద రావిచెట్టు దగ్గరికి!" అంది సావిత్రి సత్యం చెవిలో గుసగుసలాడుతూ.

"ప్రకృతి సాక్ష్యం ఎందుకు? ఎవరికి కనబడని నాలుగ్గోడల నడుమే నయం!" అన్నాడు

సత్యం.

సావిత్రి సత్యం చెయ్యి పట్టుకొని మంచం దగ్గరకు దారి తీసింది. వయసులో ఉన్న స్త్రీ స్పర్శ తగలడంతో కోరికలు బుస కొట్టిన సత్యానికా క్షణంలో విచక్షణా జ్ఞానం లేకపోయింది.

తృష్ణ తీరిన తర్వాత తప్పు చేశానని తల బాదుకొంటున్న సత్యాన్ని నడుం పట్టుకొని మంచం మీద కూర్చోబెట్టింది. సావిత్రి నెమ్మది నెమ్మదిగా తన కథ చెప్పసాగింది.

"నేను పదో క్లాసు చదువుతోన్నప్పుడు మా తల్లి పోయింది. చదువు మానేసి పది సంవత్సరాలుగా అడ్డతీగల దారిలో గుసుపూడి జంక్షన్లో టీ దుకాణం నడుపుతున్న మా నాన్నకి సహాయం చేస్తూ, వచ్చేపోయే పాసింజర్ల వెకిలి వేషాలు భరిస్తూ లోకం తీరు తెలుసుకొన్నాను. నడిపేది టీ దుకాణమైనా నడి రాత్రి ఆగి కునుకు తీసే లారి డ్రైవర్లకి మా నాన్న సారా అమ్మేవాడు. అమ్మ పోయిన తర్వాత, అమ్మకానికి తెచ్చే బ్రాందీ విస్కీలకి తను కూడా అలవాటు పడ్డంతో, అందరికీ అరువులివ్వడంతో వ్యాపారంలో నష్టమొచ్చి, సారా వ్యాపారానికి మదుపు పెట్టిన అప్పలస్వామి అప్పుల ఉచ్చుల్లో యిరుక్కు పోయాడు.

"నాలుగు నెల్ల క్రితం నీ అన్న నడుపుతున్న లారీ కింద, హఠాత్తుగా దారి కడ్డం వచ్చిన ఓ ముసలి స్త్రీ పడి ప్రాణాలు పోగొట్టుకొంది. ఆ ముసల్దాని కోడలిచ్చిన సాక్ష్యం ఆధారంతోనూ, అప్పలస్వామి దండిగా ఇచ్చిన లంచాల వల్లనూ, నీ అన్న పోలీసు కేసు కోరల్లోంచి బయట పడ్డాడు. ఈ సంగతి నీకు తెలియదు!

"గుసుపూడి జంక్షన్ మీదుగా వెళ్ళినప్పుడల్లా మిరపకాయ బజ్జీలు తిని, టీ త్రాగే నీ అన్న చాలామార్లు నన్ను టీ దుకాణంలో చూసి నేనంటే ఇష్టపడ్డాడు. మాటల సందర్భంలో నీ అన్న మనసు తెలుకొన్న అప్పలస్వామి నా తండ్రితో మాట్లాడి, నా అభ్యంతరం లేకపోవడంతో ఏవిధమైన అర్భాటమూ లేకుండా రాములవారి గుళ్ళో పెళ్ళి చేయించేశాడు.

"పెళ్ళయిన తర్వాత మొదటిసారిగా అయిదు రోజుల క్రితం నీ అన్న అడ్డతీగల ఏజన్సీకి వెళ్ళిన ఉదయం, గట్టు మీద గంగానమ్మ గుడి దగ్గర జరిగే సంతలో కూరలు కొందామని వెళ్ళాను. అక్కడ అప్పలస్వామి సంతలో కలుసుకొని, ఓ పక్కగా తీసుకుపోయి వలపన్ని బెదిరించాడు. ఒప్పుకోకపోతే యిచ్చిన అప్పులకి చెల్లుగా తాకట్టు పెట్టిన మా యింటిని స్వాధీనం చేసుకొని, ఇంకా చదువుకొంటున్న ఇద్దరు తమ్ముళ్ళనీ, మా నాన్ననీ బయటకు వెళ్ళగొడ్తానని బెదిరించాడు. తాత్కాలికంగా మూసి పెట్టించిన కేసుని తిరగతోడించి నీ అన్నని జైలుకి పంపిస్తానని భయపెట్టాడు.

"పెళ్ళయి పిల్లా జెల్లా ఉన్న వ్యక్తి పెళ్ళి కాని స్త్రీతో వ్యవహారం జరపడంలో ఉన్న సాధకబాధకాల్ని గుర్తించి, నాపైన కన్నేసిన అప్పలస్వామి అన్ని విధాలా అనువుగా ఉంటుందని ఈ ఇంట్లో నన్ను పడేటట్లు చేశాడని నా కిప్పుడు అనిపిస్తోంది. నీ అంధత్వమూ, చెట్టు కింద కాపురమూ కూడా అతనికి కలిసొచ్చాయి!

"జరిగిందంతా చెప్పాను. ఈ పరిస్థితిలో నేనేం చేసి ఉండాల్సిందో చెప్పు? మా నాన్న

దూరం ఊర్లో ఉన్నాడాయే. నీ అన్న దూరం ఊరు వెళ్ళాడాయె. దగ్గరున్న నువ్వు చేతికర్రతో దారంటే తడుముకోగలవుకాని, దెబ్బ కొట్టలేవాయె! అప్పలస్వామిని ఆపడానికి ఏ విధమైన ప్రయత్నం చేసినా రెండు కుటుంబాలూ కష్టాల పాలవుతాయి.

"నాకు తోచిన మార్గాలు రెండే రెండు. ఉదయం బెదిరించి వెళ్ళిన అప్పలస్వామి రాత్రికి వచ్చేలోగా ఆత్మహత్య చేసుకోవడం! లేదా వచ్చిన తర్వాత మాటల్లో మభ్యపెట్టి వీలుచూసుకొని కొడవలితో నరికి హత్య చెయ్యడం! ఈ రెండు చర్యలూ మనందరి జీవితాల్లోనూ భయంకరమైన పరిణామాలు తీసుకురావచ్చు. నా మానసరక్షణ కోసం ఇందరి జీవితాల్లో తుపాను సృష్టించడం అర్థంలేని పని అనిపించింది. ఇంకా కటిక నిజం చెప్పాలంటే హత్య చెయ్యడానికీ, ఆత్మహత్య చేసుకోడానికీ నాకు ధైర్యం చాల్లేదు! అందుకని నేను చెయ్యగలిగిందీ, చేసింది ఒక్కటే! అప్పలస్వామి కోరిక తీర్చడం!

"ఇప్పుడు చెప్పు, నేను చేసిన పని తప్పో ఒప్పో?" సావిత్రి చివరగా సత్యాన్ని ప్రశ్నించింది.

"నువ్వు చేసిన తప్పుని సమర్థించుకుంటున్నావు! కాని నేను క్షణికోద్రేకంలో చేసిన అవివేకపు పని క్షమించరానిది!" సత్యం తల అడ్డుగా తిప్పుతూ అన్నాడు.

"తప్పొప్పులు మనం ఆలోచించే తీరుని బట్టి ఉంటాయి. జరుగుతోన్నది ఎప్పుడు గ్రహించావో నాకు నువ్వు చెప్పలేదు. అయిదు రోజుల క్రితమా? ఈ రోజు రాత్రి అప్పలస్వామి వచ్చినప్పుడా? తిరిగి వెడుతున్నప్పుడా?" సావిత్రి కుతూహలంగా ప్రశ్నించింది.

"ఆ రోజే గ్రహించాను. అప్పలస్వామి వాడే అత్తరు వాసన నాకు తెలుసు!"

"ఈ రాత్రి అతను వచ్చేటప్పటికి నువ్వు మెలకువగా లేవా?"

"అప్పలస్వామి రావడం, వెళ్ళడం రెండూ పసిగట్టకలిగాను!" అన్నాడు సత్యం చిన్నగా.

"ఆ రోజే నిజం గ్రహించిన నువ్వు ఎందుకు మౌనంగా ఉండిపోయావు? ఈ రాత్రి ఏమిటిదని గద్దించి అడగడానికి వచ్చావు. నేను ముందుగానే జరిగిందంతా చెప్పి ఉంటే, ఏం చేసేవాడివి? ఈ నిజాన్ని నీ అన్నకి చెప్పే ధైర్యం కాని, లేదా, శాశ్వతంగా దాచే శక్తి కాని నీలో ఉన్నాయా? నిజం చెప్పు!"

సత్యానికి సమాధానం దొరకలేదు. రాత్రి అప్పలస్వామి వచ్చిన సంగతి తెలిసి ఆలోచనల్లో కూరుకుపోయాడేకాని, వెంటనే ఎందుకు అడ్డుకోలేదు? మౌనంగా ఉండిపోయాడు.

"అందుకనే మళ్ళీ నేను రెండోసారి చెయ్యాల్సిందీ, చేసిందీ ఏమిటంటే నిన్ను కూడా నా తప్పుడు పనిలో పూర్తిగా ముంచెయ్యడమే! ఇప్పుడీ రహస్యాన్ని నువ్వు జీవితాంతం దాచక తప్పదు! ఆ శక్తి దానికదే వస్తుంది. ఏమంటావు?"

సావిత్రి నిజంగా అంత దూరం ఆలోచించి అడుగు వేసిందని చెప్పడం కష్టం కాని, ఆమె మాటల్లోని వాస్తవం గ్రహించడానికి సత్యానికి సమయం పట్టలేదు.

"అయినా వావి వరసలు లేకుండా, తప్పని ఆలోచించకుండా ...." – సత్యం యింకా ఏదో అనబోతుండగా అడ్డొచ్చింది సావిత్రి.

"అవి కూడా మనం సృష్టించుకొన్నవే! మేనరికాలు మన తెలుగు వారికి ఒప్పు. మిగిలిన దేశమంతా అవి తప్పు. స్వయంవరంలో గెలుచుకువచ్చిన ద్రౌపదితో అర్జునుడితో సహా అయిదుగురన్నదమ్ములూ కాపురం చేశారు! హిమాలయచక్రతా పర్వతపు సానువుల్లో ఇప్పటికీ ఈ ఆచారం కల ద్రుపదులనే వారున్నారని మా టీ దుకాణంలో ఓసారి మిలటరీ వాళ్ళెవరో మాట్లాడుకుంటుండగా విన్నాను!

"పిండ రూపంలో ఉండగానే ఆడ శిశువుల్ని హతమార్చే ఈ మాయదారి తెగులు మరింతగా కొనసాగితే, ద్రుపదుల ఆచారం దేశమంతటా వ్యాపించి, కాలభ్రమణంలో ఈ నాటి తప్పు రేపటి ఒప్పుగా మారుతుంది!

"తాళి కట్టించుకోకుండా నేనీ గుమ్మంలో అడుగు కనక పెట్టి ఉన్నట్లయితే జరిగిందానికి నువ్వింతగా మథనపడే వాడివి కావు!

"మరోమాట – మనిషి జీవితంలో కొన్ని అనుభూతులు వయసులో తప్ప లభించవు. నీకు తెలియదేమో కాని, నీకున్న అందం నీ కుంది. అలాగని ఏ ఆడదీ కావాలని నీ జీవితంలో ప్రవేశించదు. అయితే ఆ రోజు వచ్చేవరకూ కోర్కెలు చంపుకొని నిర్జీవంగా బ్రతికే బదులు, నా మెళ్ళో అడ్డొచ్చే పసుపుకొమ్ము మాట మరిచి, పొందకలిగే సుఖాలేవో నా దగ్గరే పొందు! ఎందుకంటే ప్రస్తుత సమాజంలో పరాయి స్త్రీల మెడల్లోని మంగళసూత్రాలకి విలువలేదు! మంచీ చెడుల ఆలోచనలతో మనసు పాడు చేసుకోకుండా, జరిగిన దానికి చింతించకుండా హాయిగా ఉండడం నేర్చుకో. జరిగినన్నాళ్ళూ ఇది నీకూ, నాకు, అందరికీ మంచిది! పద, చెట్టు దగ్గరకు తీసుకువెడ్తాను."

సావిత్రి గుండె ధైర్యానికి విస్తుపోతూ, సత్యం మంచం మీద నుంచి లేచి నిల్చుని అన్నాడు.

"అఖ్ఖర్లేదు, నేను వెళ్ళగలను, చేతి కర్ర అందిస్తే చాలు."

సత్యం వెళ్ళిన తర్వాత, అనుకోని మలుపులు తిరిగిన తన జీవితాన్ని గురించి ఆలోచిస్తూ, కడుపులో ఉన్న దుఃఖాన్ని కన్నీరుగా మార్చి, భారం తీరేవరకూ ఏడ్చింది సావిత్రి.

వయసు కామాన్ని రెచ్చగొడ్తుంది. కామం దేహాన్ని దహిస్తుంది. యుక్తాయుక్త విచక్షణా జ్ఞానాన్ని కోల్పోయిన మనసు తప్పటడుగులు వేయిస్తుంది. చేసినది పాపకార్యమని గుర్తించగలిగిన మనసు కాష్యకారము అంటే పశ్చాత్తాపం చెందుతుంది. పశ్చాత్తాపం ప్రాయశ్చిత్తాన్ని కోరుతుంది. అంధుడైన సత్యానికిదే పరిస్థితి ఏర్పడింది.

బ్రతకనేర్చిన సావిత్రి ఎంతటి వేదాంతాన్ని చెప్పినా, క్షణికోద్రేకంలో తను వ్యవహరించిన తీరుని సమర్థించుకోలేక పోయాడు. ఆలోచిస్తూ కూర్చుంటే, ఓసారి రుచి మరిగిన శరీరాన్ని కోర్కెలు తిరిగి జయిస్తాయన్న భయంతో కర్ర తీసుకొని గోదావరి గట్టెక్కి అవతలి వైపుకు దిగాడు.

ప్రస్తుత కాలానికి విరుద్ధమైన నిర్ణయాన్ని తీసుకొన్న సత్యాన్ని తనలో కలుపుకొంది గోదావరి.